రైతుల సంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న బౌరంపేట పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి

దుండిగల్: రైతుల సంక్షేమం కోసమే పనిచేస్తున్నామని బౌరంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలోని సహకార కేంద్రంలో సోమవారం సమావేశం నిర్వహించారు. బాల్‌రెడ్డి మాట్లాడుతూ సంఘం నుంచి నికరలాభం రూ.49.88 లక్షలు ఆర్జించామని, రుణమాఫీ గురించి బ్యాంకు, వ్యవసాయ శాఖ అధికారులతో సంప్రదిస్తున్నామని అన్నారు. సంఘం కార్యదర్శి సయ్యద్ అసదుల్ల పరిపాలన నివేదిక, కార్యకలాపాల వివరాలను తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు వెంకటేశ్, డైరెక్టర్లు భీంరెడ్డి, దప్పు కిష్టయ్య, మహిపాల్ రెడ్డి. సత్యనారాయణ రెడ్డి, డి ఇంద్రసేనా రెడ్డి, ఈదులకంటి యాదయ్య, ఆరకలి జీతయ్య, మోహన్ నాయక్, శ్రీనివాస్ యాదవ్, రైతులు పాల్గొన్నారు.

శంకర్‌రెడ్డికి ఈటల పరామర్శ



బక్క శంకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: అనారోగ్యంతో బాధపడుతున్న బీజేపీజిల్లా ఉపాధ్యక్షుడు బక్క శంకర్‌రెడ్డిని షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పరామర్శించారు. శంకర్‌రెడ్డి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం తీవ్రంగా శ్రమించారు. ఈ నేపథ్యంలో త్వరగా కోలుకుని తిరిగి పార్టీ కోసం పనిచేయాలని ఈటల ఆకాంక్షించారు.

భూగర్భ డ్రైనేజీ పనుల పరిశీలన



సౌభాగ్యనగర్‌లో భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న జయరామ్ తదితరులు

రంగారెడ్డినగర్: ప్రజాసమస్యలను పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జయరామ్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి సౌభాగ్యనగర్‌లో రూ.5 లక్షలతో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జయరామ్ మాట్లాడుతూ స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ సమస్య కొత్త పైపులైన్ పనులతో తీరనుందని, ప్రతి ప్రాంతంలో మౌలిక సదుపాయాలను మెరుగు పరిచే దిశగా అధికారులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సౌభాగ్యనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సురేందర్, నాయకులు రవీందర్‌గుప్త, కృష్ణమూర్తి సంతోష బాబి, రఫీద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కుత్బుల్లాపూర్: ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సహృదయ ఫౌండేషన్(యుఎస్ఏ) సహకారంతో సోమవారం సూరారం రాజీవ్ గృహకల్పలో 34వ బ్లాక్‌లో నివాసముండే శ్రీకాంత్ అనే దివ్యాంగుడికి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ప్రేరణ ఫౌండర్ శరత్ సుదర్శి మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులు, మహిళలు, వికలాంగులకు చేయూత నిచ్చేందుకు నిత్యం కృషి చేస్తున్నామని తెలిపారు. శ్రీకాంత్‌కు ఆర్థిక సహకారం అందించిన సహృదయ ఫౌండేషన్ ఫౌండర్ బిందు తాడివాకకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు పసుల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలు ప్రారంభం

సుభాష్‌నగర్: బతుకమ్మ పండుగ సందడి సోమవారం మొదలైంది. గాజులరామారం డివిజన్ మహాదేవపురం కాలనీలో మహిళలు సంప్రదాయ వస్త్రాలు ధరించి ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ ఉత్సవాలను ఆటపాటలతో ఉత్సాహంగా ప్రారంభించారు. దీంతో స్థానికంగా ఎక్కడ చూసినా బతుకమ్మశోభ వెల్లివిరిసింది.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

ఆల్విన్‌కాలనీ: సాయినగర్ వెస్ట్‌కాలనీలో రోడ్డు నంబర్-4లో రూ.17 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో, త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, రాజేశ్‌చంద్ర, వీరస్వామి, జ్యోతిబా, సాయి, కోటేశ్వరరావు, రామయ్య చౌదరి, బాలు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

జీడిమెట్ల: అనారోగ్య కారణాలతో ఓ యువకుడు ఉరేసుకున్నాడు. జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం... కళావతి నగర్ చెందిన మల్లయ్య కుమారుడు సందీప్(26) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆరోగ్యం బాగా లేకపోవడంతో సోమవారం ఇంటి వద్దనే ఉన్నాడు. అతని తండ్రి మల్లయ్య, తల్లి, చెల్లి డ్యూటీకి వెళ్లారు. అయితే మల్లయ్య మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా గదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు సందీప్ విగతజీవిగా వేలాడుతూ కనిపించాడు. అతన్ని కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. అతడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

మూసాపేట: ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆల్విన్‌కాలనీకి చెందిన సాల్మన్ (52) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం ఉదయం ఆఫీస్‌కి వెళ్లేందుకు ఇంటి నుంచి బయలుదేరాడు. మెహదీపట్నం డిపోకు చెందిన బస్ జగద్గిరిగుట్ట నుంచి మెహిదీపట్నంకు వెళ్తున్నది. వివేకానందనగర్‌లోని మన ఆసుపత్రి సమీపంలో బస్సు తగలడంతో కింద పడ్డాడు. దీంతో బస్సు వెనుక టైర్లు సాల్మన్ రెండు కాళ్లపై నుంచి వెళ్లగా నుజ్జునుజ్జయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని కూకట్‌పల్లిలోని ఓమ్ని ఆసుపత్రికి తరలించారు. సాల్మన్ కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రామ..రామ..రామ ఉయ్యాలో..



రామ..రామ..రామ ఉయ్యాలో.. అంటూ కూకట్‌పల్లి ప్రాంత మహిళలు సోమవారం ఉత్సాహంగా ఆడిపాడారు. అమావాస్య రోజు గౌరమ్మను ఇంట్లో నుంచి తీసుకురావద్దనే సాంప్రదాయంతో యేటా అమావాస్యకు ముందురోజే ఇక్కడ బతుకమ్మ వేడుకలు ప్రారంభించడం ఆనవాయితీ. అయితే ఈసారి ముందు రోజు మంగళవారం రావడంతో సోమవారమే షురూ చేశారు. మొదటిరోజు మహిళలు పెద్ద సంఖ్యలో ఎంగిలిపూల బతుకమ్మలతో హనుమాన్ చౌరస్తాకు వచ్చారు. అక్కడే బతకమ్మలను పెట్టి ఆటపాటలతో ఆకట్టుకున్నారు. ఇక్కడ దాదాపు 50 ఏళ్లుగా బతుకమ్మ పాటలు పాడుతున్న సీనియర్‌సిటిజన్ గొట్టిముక్కల సావిత్రమ్మ 80 ఏళ్ల వయస్సులోనూ పాడుతూ ఆకట్టుకుంటున్నది. వేడుకల అనంతరం కూకట్‌పల్లిలోని రంగధాముని చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. అనంతరం ఫలహారాలు, గౌరమ్మ వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

-కూకట్‌పల్లి







భగవద్గీత ప్రాముఖ్యతను చాటేందుకు కృషి



యువ అవధాని ఉమామహేశ్వరరావు, పాఠశాల కరస్పాండెంట్ చింతల మల్లేశంను సత్కరిస్తున్న గోగుల పాటి కృష్ణమోహన్

కుత్బుల్లాపూర్: భగవద్గీత ప్రాముఖ్యత తెలియజేయడం కోసం భగవద్గీత అవధానం ఏర్పాటు చేశామని 'నా ఫౌండేషన్' వ్యవస్థాపకుడు గోగుల పాటి కృష్ణమోహన్ అన్నారు. సోమవారం వెంకటేశ్వర నగర్‌లోని సత్‌జ్ఞాన్ హైస్కూల్‌లో యువ అవధాని, ప్రవచన కర్త యెర్రంశెట్టి ఉమామహేశ్వరరావుతో భగవద్గీత అవధానం ఏర్పాటు చేశారు. కృష్ణమోహన్ మాట్లాడుతూ భావితరాలకు సాహిత్యంలోని మాధుర్యం, భగవద్గీత ప్రాముఖ్యత తెలియజేసేందుకు తమ సంస్థ ద్వారా కృషి చేస్తున్నామని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ చింతల మల్లేశం మాట్లాడుతూ పాఠశాల పిల్లలనే పృచ్ఛకులుగా (ప్రశ్నలు అడిగే వారిగా) ఈ కార్యక్రమం నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో భగవద్గీత పట్ల ఆసక్తి పెంపొందించినట్లు అయిందన్నారు. యువ అవధాని యెర్రంశెట్టి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు భగవద్గీతను ప్రతినిత్యం పఠించినట్లైతే తాము చదువుకుంటున్న విద్యలో కూడా మరింత రాణించగలుగుతారని పేర్కొన్నారు. శ్లోక దర్శనం- నికిత, భవ్య శ్రీ, సంఖ్యా దర్శనం - లావణ్య, నవచైతన్య, అంత్యాక్షరి - ప్రభాస్, సాయి గీత, అధ్యాయ వివరణ - యశస్విని, జలహాసిని, అఖండ పఠనం - జాహ్నవి, అఖిల, విలోమ పఠనం - శ్రీ గోదా, నందిని దూబే, అక్షర దర్శనం - హాసిని, గీతిక పాల్గొని అవధానికి ప్రశ్నలు సంధించారు. విద్యార్థులు వేసిన ప్రశ్నలకు అవధాని సమయస్ఫూర్తితో భగవద్గీత శ్లోకాలు ఆలపిస్తూ సమాధానాలు ఇచ్చారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు, నా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గోగులపాటి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో యర్రంశెట్టి ఉమామహేశ్వరరావును, చింతల మల్లేశంను ప్రశంసాపత్రాలతో సన్మానించారు.

కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం

కూకట్‌పల్లి: కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ అన్నారు. జలవాయువిహార్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం, పోషకాహారం అవగాహన కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూకట్‌పల్లిలో స్వీపర్లు, ఎంటమాలజీ కార్మికులు సుమారు 3200 మంది ఉన్నారని వీరి కోసం 9 ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. కూకట్‌పల్లి జోన్‌లోని నాలుగు సర్కిల్స్‌లో 2 చొప్పున, అల్వాల్‌లో ఒకటి చొప్పున మొత్తం 9 మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే ఎన్ఐఎన్ అధికారులతో పోషకాహారం, హైజీన్‌లపై కార్మికులకు అవగాహన కల్పించామని తెలిపారు. మంగళవారం బోయినపల్లి, బాలానగర్ కాలనీ కార్మికులకు రాజు కాలనీలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద కమ్యూనిటీహాల్ లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఐఎన్ అధికారులు, ఈఎస్ఐ వైద్యులు, ఉప కమిషనర్ కృష్ణయ్య, ఏఎంఓహెచ్ శ్రీనివాస్, డీసీ ఉదయ్‌కుమార్, కార్యక్రమం నోడల్ అధికారి, ఏఎంసీ శ్రీకాంత్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేటర్లతో ఎమ్మెల్యే సమావేశం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ కార్పొరేటర్లతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రజలకు అందుబాటులో ఉండి రోడ్లు, డ్రైనేజీ మౌలిక వసతుల సమస్యలు ఉంటే తెలుసుకుని సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజల్లో హైడ్రా అంటే భయం నెలకొందని, దీనిని తుడిచి పెట్టే బాధ్యత మనందరిపై ఉందని సూచించారు. అలాగే త్వరగా బతుకమ్మ వేడుకలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పండుగను ప్రశాంతంగా జరుపుకునేలా మనవంతూ చొరవ తీసుకోవాలని సూచించారు. ప్రజాశ్రేయస్సు కోసం పోరాడుతూనే బీఆర్ఎస్ పదేళ్లలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ, పెండింగ్ పనులు కూడా త్వరగా పూర్తయ్యేలా బాధ్యత తీసుకోవాలని కోరారు.

నాలాపై అక్రమ నిర్మాణాలు

స్థానికుల ఇక్కట్లు.. వర్షాకాలంలో వరద ముప్పు





బాక్స్ నాలాకు ఆనుకుని ఇష్టారాజ్యంగా చేపట్టిన నిర్మాణాలు

చింతల్: కొంతమంది ఇళ్లయజమానుల అత్యాశ నాలా పక్కన నివసించే వారికి ప్రాణసంకటంగా మారింది. చింతల్ డివిజన్‌లో నాలాకు ఆనుకొని ఉన్న ఇళ్ల యజమానులు ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపట్టారు. నాలాపై కూడా నిర్మాణాలు చేపట్టారు. అయినా అధికారులు ఏమీ పట్టించుకోవడంలేదు. దీంతో వర్షాకాలంలో చుట్టుపక్కల ఇళ్లలో నివసించేవారికి, స్థానికులకు చాలా ఇబ్బందికరంగా మారింది. వరద నీరు సాఫీగా వెళ్లే పరిస్థితి లేదు. హెచ్ఎంటీ ఖాళీ ప్రదేశం నుంచి వచ్చే వరదనీరు విజయనగర్ కాలనీ, మారుతినగర్ మీదుగా శ్రీనగర్, మారుతినగర్ మధ్యలో ఉన్న నాలా మీదుగా గణేశ్‌నగర్ నాలాలో కలుస్తుంది. శ్రీనగర్ విజయనగర్ కాలనీ మధ్యలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి వెళ్లే ఈ బాక్స్ నాలాకు ఆనుకొని నిర్మాణాలు చేపట్టారు. దీంతో బాక్స్ నాలాపై ఉన్న సిమెంట్ బిల్లలు తీసి క్లీనింగ్ చేయడానికి వీలు లేకుండా పోయింది. సిమెంట్ బిల్లలు తీయకుండా నాలాలో పేరుకుపోయిన మట్టి విడుదలను తొలగించేందుకు జీహెచ్ఎంసి సిబ్బంది నరకయాతన పడాల్సి వస్తోంది.

వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి వినాయక భక్త బృందం చైర్మన్ నాయినేని సూర్యప్రకాశ్ రావు ఆధ్వర్యంలో సోమవారం ఒంటరి మహిళలు, వితంతులు, వయోవృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గణేశ్ నవరాత్రుల లడ్డూను వేలం వేయగా వచ్చిన డబ్బును ప్రజా సేవ కోసం ఉపయోగిస్తున్నామన్నారు. కమిటీ సభ్యుల మద్దతుతో 12 ఏళ్లుగా 150 మందికి ప్రతి 3 నెలలకు రూ. 900 చొప్పున ఏడాదికి రూ. 3,600 అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ అర్సనపల్లి సూర్యారావు, ఉపాధ్యక్షుడు నాయినేని పద్మారావు, కోశాధికారి చౌదరి సూర్యారావు, కార్యదర్శి అనంత నాగరాజు, సభ్యులు నర్సింగ్ రావు, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్లస్థలాలపై విధాన ప్రకటన చేయాలి

ప్రభుత్వానికి ఆస్కాని మారుతీసాగర్ విజ్ఞప్తి



సూరారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న జర్నలిస్టులు..

సుభాష్‌నగర్: అర్హులైన ప్రతి జర్నలిస్టుకూ ఇళ్లస్థలాలను కేటాయించే విషయంలో ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీసాగర్ కోరారు. సోమవారం సూరారంలోని ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ టీయూడబ్ల్యూజే హెచ్-142 అధ్యక్షుడు సుధీర్ మంకాల అధ్యక్షతన జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ నగరంతోపాటు ఇతర జిల్లాల గ్రామీణ విలేకరుల ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం విధానపరమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో సంబంధిత శాఖ మంత్రి రాష్ట్రంలోని యూనియన్ నేతలతో సంప్రదింపులు జరిపి ఒక రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసుకుని ముందుకుసాగాలని, ఆ దిశగా చర్యలు మొదలుపెట్టాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నిధులతో సూరారంలోని ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేసి జర్నలిస్టులకు అందుబాటులో తీసుకువస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. సమావేశంలో మేడ్చల్ జిల్లా నాయకులు కొలిపాక వెంకట్, సుగ్రీవుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివాజీ, ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, సీనియర్ జర్నలిస్టులో శ్రీనివాస్, నర్సింలు, పత్తి మాధవ్, శ్రీగిరి శ్రీనివాస్, ఎర్రోళ్ల బాబు, సురేష్ గౌడ్, శోభన్, కళ్యాణ్, బాన్సువాడ వెంకటేష్, జుట్టు సాయి, అనంత రావు, క్రిష్ణ పంతులు, రవీందర్‌రెడ్డి, రాజిరెడ్డి, గణేశ్‌రెడ్డి, ఉదయ్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'లో ఫిర్యాదులు



కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్‌కు సమస్యను వివరిస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం జరిగిన ప్రజావాణిలో పలు ఫిర్యాదులు అందాయి. గాజులరామారం ఉప కమిషనర్ మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మొత్తం ఎనిమిది ఫిర్యాదులు రాగా వాటిలో టౌన్ ప్లానింగ్ రెండు, ఇంజనీరింగ్ 5, హెల్త్ అండ్ శానిటేషన్ విభాగంపై ఒకటి చొప్పున ఫిర్యాదులు వచ్చాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో ఉపకమిషనర్ నరసింహ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 8 ఫిర్యాదులు రాగా టౌన్ ప్లానింగ్ రెండు, ఇంజనీరింగ్ 2, విద్యుత్ 1, ఎంటమాలజీ ఒకటి, హెల్త్ అండ్ శానిటేషన్ రెండు ఫిర్యాదులు వచ్చాయని అధికారులు పేర్కొన్నారు. కాగా, కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో నిర్వహిస్తున్న ప్రజావాణిలో వస్తున్న ఫిర్యాదులపై అధికారులు చర్యలు చేపట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్, శానిటేషన్ ఫిర్యాదులను పట్టించుకున్న పాపాన పోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. గతవారం రెండు ప్రధాన ప్రాంతాల్లో చెత్త విషయంపై ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు తొలగించలేదని వాపోయారు. ఇలా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలి పేర్కొన్నప్పటికీ సిబ్బంది మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చిన్నారులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు..

ఎంపీ ఈటల రాజేందర్



బాచుపల్లి వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి స్కూల్‌లో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల

నిజాంపేట్: చిన్నారులను ప్రోత్సహిస్తే ఎన్నో అద్భుతాలుసృష్టిస్తారని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. 'సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్' ఆధ్వర్యంలో 125 మంది చిత్రకారులు 108 నిమిషాల్లో 125 విభిన్న గణేశుల పెయింటింగ్‌లను కాన్వాస్‌పై చిత్రించి విశ్వగురు వరల్డ్ రికార్డ్ సాధించిన నేపథ్యంలో సోమవారం బాచుపల్లిలోని వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఈటల ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వారికి జ్ఞాపికలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ చిన్నారులు గీసిన గణేశుల చిత్రాలు అద్భుతంగా ఉన్నాయని ప్రస్తుతించారు. కార్యక్రమంలో సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ నిర్వాహకుడు సత్యవోలు రాంబాబు, ఈవెంట్ చైర్మన్ డాక్టర్ ఎం.ఆర్.ఎస్.రాజు, రైల్ వికాస్ నిగమ్ జనరల్ మేనేజర్ ఆనంద్ చెక్కిళ్ల, సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాల్, వీఆర్ఎస్ చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ వల్లూరిపల్లి రమణ, స్కూల్ డైరెక్టర్ కొడాలి విజయరాణి, ప్రైమ్ 9 హెల్త్ సీఈఓ డాక్టర్ కిషోర్ కుమార్, ప్రముఖ చిత్రకారులు శేషబ్రహ్మం, కృష్ణాది శేషు, రవిచరణ్, డాక్టర్ మార్కెండేయులు, దేవరపల్లి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి పరిష్కారాలే భవిష్యత్‌కు మార్గాలు

అంతర్జాతీయ సదస్సులో ఐఐటీ ధన్‌బాద్ డైరెక్టర్ సుకుమార్ మిశ్రా



సదస్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న సుకుమార్ మిశ్రా, యాజులు మెదురి

సుభాష్‌నగర్: సవాళ్లను పరిష్కరించడంలో సహకారం, ఆవిష్కరణలు కీలకమని ఐఐటీ ధన్‌బాద్ డైరెక్టర్ సుకుమార్ మిశ్రా అన్నారు. బహదూర్‌పల్లిలోని మహీంద్రా యూనివర్సిటీలో సైబర్ ఫిజికల్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలపై మూడు రోజులపాటు జరిగిన ద్వితీయ అంతర్జాతీయ సదస్సు(ఐసీపీఈఈవీ) సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుకుమార్ మాట్లాడుతూ మనం అభివృద్ధి చేసే పరిష్కారాలు రేపటి భవిష్యత్తుకు దారి చూపుతాయన్నారు. అనంతరం మహీంద్రా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ యాజులు మెదురి మాట్లాడుతూ సమగ్ర ఆలోచనలు, సృజనాత్మకతను ప్రోత్సహించడం ద్వారా దేశానికి మేధో రాజధానిగా ఎదగడమే లక్ష్యమన్నారు. పరిశోధన, అభివృద్ధి రంగాల్లో కొత్త ఆవిష్కరణలు, భాగస్వామ్యాలతో ముందుకు వెళ్లాలన్నారు. ఎలక్ట్రికల్, కంప్యూటర్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ రామ్ వేమూరి మాట్లాడుతూ పవర్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు వంటి ఆధునిక రంగాల్లో సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధికి సహకరించడం ఈ సదస్సు ముఖ్యోద్దేశమన్నారు. ఆయా అంశాలపై పలువురు నిపుణులు ప్రసంగించారు. మహీంద్రా యూనివర్సిటీ ఎలక్ట్రికల్, కంప్యూటర్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ భార్గవ రాజారాం, భువనేశ్వరి, గోపీనాథ్ జీఆర్, శ్రీధర్ మాడిచెట్టి తదితరులు పాల్గొన్నారు.

దోపిడీకి గురవుతున్న కాంట్రాక్ట్ కార్మికులు



షాపూర్‌నగర్ రైతుబజారు వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు..

కుత్బుల్లాపూర్: కాంట్రాక్ట్ కార్మికులకు ఎలాంటి చట్టాలు అమలు చేయకపోవడంతో దోపిడీకి గురవుతున్నారని కుత్బుల్లాపూర్ మండల సీఐటీయూకార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. దేశ వ్యాప్తంగా సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనల్లో భాగంగా సోమవారం షాపూర్‌నగర్ రైతు బజార్ నుంచి కార్మికులు 'చలో లేబర్ కార్యాలయం' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ కాంట్రాక్టర్ కార్మికులతో 12 గంటలపాటు పనులు చేయించుకుంటూ వారిని నిలువుదోపిడీ చేస్తున్నారని, ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు అమలు చేయడం లేదని, వెంటనే వారికి ఆ సదుపాయాలు కల్పించాలన్నారు. కొన్ని ఫార్మా కంపెనీలు ఇష్టానుసారంగా కార్మికులను తొలగిస్తూ వారి జీవితాలతో ఆటలాడుతున్నాయని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు రూ.26 వేల కనీస వేతనాలను అమలు చేయడంతోపాటు కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు అంజయ్య, నాయకులు శ్రీను, మల్లారెడ్డి, తాయన్న, ఆంజనేయులు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే గాంధీ అధికారులను ఆదేశించారు. సోమవారం భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీ కాలనీ సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మొదటగా రోడ్ల సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో రోడ్డు పనులను పూర్తి చేయాలని సూచించారు. వర్షాల వలన దెబ్బ తిన్న రోడ్లను వెంటనే పునరుద్ధరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంఓహెచ్ శ్రీకాంత్ రెడ్డి, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఏఈ రషీద్, మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్, ఆదర్శ్ రెడ్డి, భాస్కర్, నాగమణి, కాలనీ సొసైటీ అధ్యక్షులు వెంకట్‌రావు, వైస్ ప్రెసిడెంట్ నారాయణగౌడ్, డైరెక్టర్ నీలకంఠం, సీనియర్ సిటిజన్స్ సత్యనారాయణ, బాగ్దే, భీంరెడ్డి, వెంకట్ రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.